# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 30 మే, 2024 | పేజీలు : 3





**ఖరీఫ్ ప్రణాళిక ఖరారు**

# మురుగుతున్న నిధులు.. అభివృద్ధికి చెదలు

### శివారెడ్డి గూడెం- రెడ్డినగర్ మధ్య వంతెన నిర్మాణానికి గ్రహణం వీడేనా?

### గత ప్రభుత్వ వైఫల్యం..కాంట్రాక్టర్ నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భూదాన్ పోచంపల్లి మండలంలోని శివారెడ్డి గూడెం రెడ్డి నగర్ ల మధ్య రహదారిలో చిన్నేరు వాగుపై వంతెన నిర్మాణం నేటికీ కల కలగానే మిగిలి పోనుందా అనే సంశయం సర్వత్ర వినపడుతున్న బహిరంగ సత్యం. సమీప వంకమామిడి ఇంద్రియాల దంతూరు గౌస్ కొండ ధర్మా రెడ్డి పల్లె గ్రామాల ప్రజల రాకపోకల కష్టాలను తీర్చేందుకు నడుం బిగించిన అప్పటి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా 21సెప్టెంబర్ 2021న పూర్వ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించగా ఆవెంటనే పాలకుల సమర్థతనో లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో ఇంకా మరేదైనా సాంకేతిక సమస్య వల్లనో మధ్యలోనే హంసపాదం అన్నట్లుగా పనులు నిలిచిపోయి బ్రిడ్జి నిర్మాణానికి గ్రహణం పట్టింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ,ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా రూ.622 లక్షల నిధులతో శివారెడ్డి గూడెం రెడ్డినగర్ ల మధ్య రహదారిపై 155.23 మీ.పొడవుతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి పునాది పడినా నేటికీ వంతెన నిర్మాణం పూర్తికాక ప్రజల ఆకాంక్ష తీరని కలగానే మిగిలిపోయింది.జనవరి 2022 న పనులు ప్రారంభించి జూలై 23 నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో పనులు మొదలు పెట్టారు. ఐదు సంవత్సరాల వరకు నిర్వహణ వ్యయం కింద రూ.7.5 లక్షలను కేటాయించారు కూడా.అయితే బ్రిడ్జి నిర్మాణానికి మంజూరైన నిధులు మురిగిపోతూ అభివృద్ధికి చెదలు అన్నట్టుగా తయారైందీ వ్యవస్థనీ ఆ దారిన వెళ్లిన ప్రతి ఒక్కరినీ పాలకుల చిత్తశుద్ధిని శంకిస్తూ వెక్కిరిస్తూ ఉందని స్థానిక గ్రామ ప్రజలతో పాటు అందరూ ఘాటుగా విమర్శిస్తున్నారు. వానాకాలం మొదలైందంటే చాలు ఇక్కడి ఇరుగు పొరుగు గ్రామాల ప్రయాణికుల కష్టాలు అంతా ఇంతా ఉండవు. వాగు ఉప్పొంగితే దాటడానికి కన్నీళ్ళపర్వం మొదలవుతుంది. కొన్ని రోజుల తరబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పైగా ఇరుగు పొరుగు గ్రామాల వ్యవసాయ భూములు చిన్నేరుకు అవతల ఇవతల ఇరు ప్రక్కల ఉండడంతో సాగు కష్టాలు అంతా ఇంకా ఉండవు. ప్రతినిత్యం అటూ ఇటూ రాకపోకలు సాగిస్తూనే ఉంటారు.వరదలు పోటెత్తుతున్నప్పుడు ఇరు గ్రామాలకు వెళ్లాలనుకునే వారు పదుల సంఖ్యలో కిలోమీటర్లు చుట్టూ తిరిగి సమయాన్ని వృధా చేసుకుని ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ కష్టాలను అధిగమించేందుకు ప్రజలు ప్రజాప్రతినిధుల వద్ద ఎన్నోసార్లు మొరపెట్టుకుంటే ఎట్టకేలకు వంతెన మంజూరైనప్పటికీ బ్రిడ్జి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా అక్కడ వేసిన శిలాఫలకం వచ్చి వెళ్లే వారిని ప్రశ్నిస్తూనే ఉంది.వాగు ఉధృతిలో ఉన్నప్పుడు అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పిల్లర్ల వంక చూస్తూ అధికారుల పనితీరును అవహేళన చేస్తున్నాయి.వంతెన పూర్తి చేయడానికి గత ప్రభుత్వాల వైఫల్యమా? అంచనా బడ్జెట్ పెరిగిపోవడమా? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా?లేక న్యాయపరమైన చిక్కులు ఉన్నాయా?ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా ?అవన్నీ ప్రక్కన పెడితే పాలకుల సమర్థతను ఇచ్చిన హామీల తీరును ప్రభుత్వాల వైఖరిని ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రజా ప్రతినిధుల వైనాన్ని మాత్రం ప్రతి ఒక్కరు ప్రశ్నిస్తున్నారు. ప్రజాక్షేమం అభివృద్ధి కోసం ప్రజల సౌకర్యం కోసం నిత్యం పాటుపడే ప్రజల్లోనే ఉండే నాయకులు అధికారమున్న నేతలు దేనినైనా ఎదుర్కొని ఎంతటి జఠిలమైన సమస్యనైనా పరిష్కరించి ప్రజలను ఆదుకుంటారు.అలాంటిది ఈ చిన్నేరు వాగుపై నిలిచి పోయిన వంతెన నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం ఒక లెక్కనా అని సగటు బాటసారి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాడు. సొంత లాభం సొంత పని కొంత మానుకొని ప్రజల సౌకర్యమే మన వంతు అనుకుని బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు ఉన్న అన్ని అడ్డంకులను తొలగించి గ్రామాల చిరకాల వాంఛను నెర వెర్చి నిజమైన ప్రజా ప్రతినిధుల నిస్వార్థ సేవను నిరూపించుకోవాలని ప్రజలంతా కోరుతున్నారు.

# సకల వసతులతో ప్రభుత్వ పాఠశాలలు



### కలెక్టర్ హనుమంత్ జండగే

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఆహ్లాదకర వాతావరణంలో సకల వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే కొండిబా అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ధాన్యపు కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ళు, తరలింపు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న తరుణంలో ఇంకా ఎక్కడెక్కడ ఆలస్యం జరుగుతుందో తెలుసుకోవడాని త్వరితగతిన పూర్తి చేసేందుకు తీసుకోవలసిన చర్యలలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని గౌస్కొండ, భీమన పల్లి గ్రామాలలోని ధాన్యపు కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ధాన్యాన్ని తరలించిన రైస్ మిల్లర్ల వివరాలను ట్రక్ షీట్ల రికార్డులను తనిఖీ చేశారు.అన్ని ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ళు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పాఠశాలలకు పూర్వ వైభవం తెచ్చే విధంగా చేస్తున్న పనుల్లో భాగంగా ఆయన మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అన్ని మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించేందుకు రేవనపల్లి,శివారెడ్డి గూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం పెరిగేలా మరింతగా ప్రవేశాలు పెంచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తుందనీ దీనిలో భాగంగానే ప్రతి తరగతి గదిలో విద్యుత్తు, ఫ్యాన్స్,గ్రీన్ బోరడ్స్ , బల్ల కుర్చీలు, విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ , ప్రతి తరగతి గది గోడలపై రంగు రంగు చిత్రాల పెయింటింగ్, డిజిటల్ స్క్రీన్స్ ఏర్పాటు,ఆట వస్తువులు,ల్యాబ్స్ , సర్వం సిద్ధం చేయనున్నట్లు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.పాఠశాలకు సంబంధించిన తలుపులు కిటికీలు రిపేర్లు అన్ని పూర్తి చేసి పాఠశాలలో తెరిచేలోగా సిద్ధం చేసి ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ బెన్ షాలోమ్, మండల అభివృద్ధి అధికారి భాస్కర్, ఎమ్మార్వో శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి,ఏఈ వెంకటేశ్వర్లు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే

**ప్రజాపక్షం/సూర్యాపేట :** నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే అన్నారు. బుధవారం జిల్లా పోలస్ కార్యాలయంలో నకిలీ విత్తనాల నివారణ అంశంపై పోలీస్, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతులు, వ్యవసాయ రంగం నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలను గుర్తించి సీజ్ చేయాలని చెప్పారు. జిల్లాలోని డిఎస్పిల ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి టాస్క్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. దేశానికి వ్యవసాయ రంగం ముఖ్యమైన ఆధారమని అలాంటి వ్యవసాయం చేసే రైతులు ఆరుగాలం కష్టపడి నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విత్తనాలు, ఎరువులు అందించే డీలర్లు రైతులకు నాణ్యమైనవాటిని సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నివారణకు కట్టుబడి ఉందని, రైతులు నష్టం జరగకుండా చూడాలన్నారు. పోలీసుల, వ్యవసాయ శాఖ అధికారులతో మండల, సర్కిల్, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పటిష్టమైన నిగా ఏర్పాటు చేయాలన్నారు. సూర్యాపేట జిల్లా ఆంధ్రా రాష్ట్రానికి ముఖ్య సరిహద్దుగా ఉన్నదని, కృష్ణపట్టి వెంట నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి నాగేశ్వర్ రావు, ట్రైని ఐపిఎస్ అధికారి రాజేష్ మీనా, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి నాగయ్య, డిఎస్పిలు రవి, శ్రీధర్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ డిఎస్పి మట్టయ్య, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, సీఐలు, ఎస్ఐలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అమ్మ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/గుండాల :** విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమం ప్రారంభించడానికి ముందే మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలోని పనులను వేగవంతం చేయాలని ఎంపిడివో దేవిక సూచించారు. మండల పరిధిలోని బండకొత్తపల్లి, వస్తాకొండూరు, పెద్దపడిశాల, తుర్కలషాపురం, వంగాల, పాచిల్ల పాఠశాలలో జరుగుతున్న పనులను బుధవారం ఎంపిడివో పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, చైర్మన్లు సమన్వయంతో పాఠశాలలో విద్యుత్, మరుగుదొడ్లు, త్రాగునీరు మైనర్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేష్, మౌనిక, సిఆర్‌పి లింగయ్య పాల్గొన్నారు.

## ఒలంపియాడ్‌లో సత్తా చాటిన ఠాగూర్ విద్యార్థులు

**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన ఠాగూర్ విద్యాలయం విద్యార్థులు సెమ్స్ వారు నిర్వహించిన ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో సత్తా చాటారు. గత ఫిబ్రవరి నెలలో నిర్వహించిన పోటీలలో పాఠశాల విద్యార్థుల రాష్ట్ర, జోనల్ స్థాయి ర్యాంకులు సాధించారు. ఏడవ తరగతికి చెందిన పొట్లపల్లి సాయి యశ్వంత్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్, తొమ్మిదవ తరగతికి చెందిన పి గాయత్రి రాష్ట్ర 8వ ర్యాంకులు సాధించారు. అలాగే జోనల్ స్థాయిలో 3వ తరగతికి చెందిన ఏ సిద్ధార్థ్, ఎండి అదిబా, 10వ తరగతి పూర్తి చేసుకున్న బోయపల్లి వెన్నెల లు వరుసగా 7, 8, 9, 10 ర్యాంకులను పొందారు. వీరికి త్వరలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గడ్డం విశ్వనాథ్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## నాసికరం విత్తనాలు అమ్మితే చర్యలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** రైతులకు నాసికరం విత్తనాలు, ఎరువులు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్. వెంకన్న ఫర్టిలైజర్ దుకాణ యజమానులకు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను, ఎరువుల గోదాములను తనిఖీ చేసి స్టాక్ రికార్డులు, బిల్ బుక్కులు, విత్తనాలను పరిశీలించారు. రైతులకు విత్తనాలను అమ్మినప్పుడు వారికి రసీదు ఇవ్వాలని అన్నారు. రైతుల ఆధార్ కార్డు ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని అన్నారు. నకిలి విత్తనాలు అమ్మిన, ఎరువుల కొరత సృష్టించిన అట్టి ఫర్టిలైజర్ డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల వద్ద ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని అన్నారు. నిషేదిత బిటి3 విత్తనాలు అమ్మరాధని దుకాణ యజమానులను హెచ్చరించారు. నకిలి విత్తనాల సమాచారం తెలిస్తే రైతులు వెంటనే వ్యవసాయ అధికారులకు, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని మండల రైతులను కోరారు.

## ఉపాధీలకు వేతనాలను వెంటనే చెల్లించాలి

**ప్రజాపక్షం/చిట్యాల :** ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు కత్తుల లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంఘం మండల కమిటి ఆధ్వర్యంలో చిట్యాల ఏపిఓకి వేతనాల చెల్లింపు కోసం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలలకు గతంలో వారానికొక సారి డబ్బులు చెల్లించేవారని, ప్రస్తుతం నెలలు గడుస్తున్నా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో క్రమేపి నిధులు తగ్గించడం కారణంగా పెద్ద ఎత్తున వేతన నిల్వలు పేరుకు పోయాయని, వెంటనే వారికి వేతనాలను విడుదల చేసి ఆదుకోవాలని లింగస్వామి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడిసె లక్ష్మి నారాయణ, జోగు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి యువకుడు మృతి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** రైలు కింద పడి యువకుడు మృతిచెందిన సంఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతారాంపురంకు చెందిన తన్నీరు వెంకటమ్మ కుమారుడు సాయికిరణ్ (24) స్థానికంగా ఓ ప్రైవేట్ సంస్థలో డెలివరి బాయ్‌గా పనిచేస్తున్నాడు. సీతారాంపురంకు చెందిన ఓ మైనర్ బాలికను సాయికిరణ్ 2020 నుంచి వేధిస్తున్నాడు. అయితే 2022లో పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగింది. ఈనెల 28న రాత్రి సదరు బాలిక ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. దీనిపై బాలిక తల్లి బుధవారం ఉదయం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో టూటౌన్ సీఐ నాగార్జున సాయికిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదైన సమాచారం తెలుసుకున్న సాయికిరణ్ రైల్వేట్రాక్ పైకి వెళ్లి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు స్నేహితులకు వాట్సాప్ స్టేటస్‌లో సమాచారం పెట్టాడు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైలు డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకోని పరిశీలించారు.

### వేదింపులతో నా కుమారుడు మృతి : తల్లి వెంకటమ్మ

తన కుమారుడి మృతికి సోమగాని శ్రీనివాస్, మీసాల శ్రీనివాస్‌లు ఇద్దరు కారణమని వారు ఎమ్మెల్యే అండ చూసుకోని తన కుమారుడిపై వేదింపులకు పాల్పడ్డారని మృతుడి తల్లి వెంకటమ్మ ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

## సబ్సిడీ విత్తనాలను రైతులు వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/శాలిగౌరారం :** జీలుగ, జనుము సబ్సిడీ విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని నకిరేకల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు నాయక్ రైతులను కోరారు. బుధవారం శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రైతులు జనము, జీలుగ విత్తనాలను వాడినట్లయితే సూక్ష్మజీవులు నశించి పంట దిగుబడి పెరుగుతుందని అన్నారు. శాలిగౌరారం మండలానికి 100 క్వింటాల్ల జీలుగ విత్తనాలు రావడం జరిగిందని, ప్యాక్స్ ఆఫీసులో 30 కేజీల జీలుగ విత్తనాల బ్యాగుకు 2790 రూపాయలకు గాను సబ్సిడీపై 1116



రూపాయలకు రైతులు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. నకిరేకల్ డివిజన్ మొత్తానికి 750 క్వింటాల విత్తనాలు మంజూరు చేయగా 448.5 క్వింటాల విత్తనాలు రావడం జరిగిందని, రానున్న వానాకాలంలో 23 వేల ఎకరాలు కాటన్, 20 వేల ఎకరాల వరకు వరి సాగు చేసే అవకాశం ఉందని రామారావు నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో శాలిగౌరారం మండల వ్యవసాయ అధికారి సౌమ్య శృతి, ప్యాక్స్ సీఈవో నిమ్మల ఆంజనేయులుతో పాటు ఏఈఓ లు కొండా నవీన్ కుమార్, శ్రవణ్ కుమార్, కీర్తి, భార్గవి పాల్గొన్నారు.

## ఎన్నికలలో తీన్మార్ మల్లన్న గెలుపొందడం ఖాయం



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లంతా మల్లన్నకు అండగా నిలిచారని అన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌షి ఎన్నికలలో ఓటేసిన గ్రాడ్యుయేట్ ఓటర్లందరికి ఈ సందర్భంగా శంకర్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్‌సిగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్నను ఓడించడానికి బిఆర్‌ఎస్, బిజెపి పార్టీల నేతలు అనేక కుట్రలు, కుతంత్రాలు పన్నారని విమర్శించారు. ఈ రెండు పార్టీలు డబ్బులు పంచి గ్రాడ్యుయేట్ ఓటర్లను ప్రలోభాలకు గురిచేశాయని విమర్శించారు. అయినప్పటికీ గ్రాడ్యుయేట్ ఓటర్లంతా తీన్మార్ మల్లన్నకే మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ఓటమి భయంతో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. ఎంపి, ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాల తర్వాత బిఆర్‌ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికలలో ఓటమి భయంతో కాంగ్రెస్ డబ్బులు పంచుతూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వ్యాఖ్యానించడం పట్ల శంకర్ నాయక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎంపి, ఎంఎల్‌సి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు పోలే జయకుమార్, కె.వి.ఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు మామిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి



**ప్రజాపక్షం/చింతపల్లి :** రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.శ్రావణికుమారి అన్నారు. మండల పరిధిలోని వింజమూర్ గ్రామంలో బుధవారం విత్తనాల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలపై శ్రావణి రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన విత్తన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తదనంతరం బిల్లు తప్పకుండా తీసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ప్యాకెట్‌లలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేసి, ఆ ప్యాకెట్లను పంట కాలం ముగిసే వరకు భద్రపరుచుకోవాలని అన్నారు. ప్యాకెట్‌లలో లేని పత్తి విత్తనాలను, గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయొద్దని ఆమె హెచ్చరించారు. ఇప్పటికే మండలంలోని పత్తి విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా కల్తీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆ కార్యక్రమంలో వింజమూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. మధు, రైతులు పాల్గొన్నారు.

## అధికారులు అందుబాటులో ఉండాలి...

**ప్రజాపక్షం/చందంపేట :** అధికారులు అందుబాటులో ఉండి ప్రతి పనిని సక్రమంగా సకాలంలో నిర్వహించాలని మండల తహశీల్దార్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభ మవుతున్న తరుణంలో తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే విద్యార్థులకు సంబందించిన ప్రతి ఒక్క పనిని త్వరితగతిన పూర్తి చేసి వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఎవరైన అధికారులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించి పనులు చేయకపోతే నేరుగా తనను కలిసి సమస్యను తెలపవచ్చని అన్నారు. ప్రతి రోజు అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సూచించారు.

## ట్రాక్టర్ పల్టీ కొట్టి యువకుడు మృతి



**ప్రజాపక్షం/మునుగోడు :** ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని కొరటికల్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన అన్నం నరేష్ పద్మ కొడుకు అన్నం విష్ణువర్ధన్ తో కలిసి ఇంటి నుండి ట్రాక్టర్ తీసుకొని తన వ్యవసాయ భూమి దగ్గరికి బయల్దేరి క్రమంలో కోమటి కుంట కట్ట పైన ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ టైర్ విష్ణువర్ధన్ మీద పడడంతో విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తల్లి అన్నం పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన ఎఓ సరిత

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** నకిలి విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో సరిత అన్నారు. బుధవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. రైతులకు విత్తనాలను ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలన్నారు. నకిలి విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు లైసెన్స్ కలిగి డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, రసీదులను తప్పకుండా తీసుకోని వాటిని పంటకాలం పూర్తయ్యేదాక భద్రపరుచుకోవాన్నారు.

# టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ఏది?

**ప్రజాపక్షం/కోదాడ:** టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ భిక్షం అన్నారు.బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా టిపిటిఎఫ్ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కామన్ స్కూల్ స్థాపనే,శాస్త్రీయ విద్యా విధానం,రాష్ట్రంలో ఉన్న పిల్లలందరికి ఒకే రకమైన నాణ్యమైన విద్య అందేలా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం ఆధీనంలోనే విద్య కొనసాగాలని పోరాడుతున్న సంఘం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ అన్నారు. ప్రతి పాఠశాలకు సర్వీస్ పర్సన్‌ను నియమించి,పాఠశాలల పారిశుద్ధ్య నిర్వహణ జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ రామనర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందుతున్న సీనియర్ సభ్యురాలు సిహెచ్ పద్మావతిని సంఘం పక్షాన ఘనంగా సన్మానించారు. డివిజన్ కార్యదర్శి బదుగుల సైదులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు హనుమంతరావు, సీనియర్ నాయకులు పోటు నరసింహారావు, డిఎస్ స్వామి, ఆర్‌కె మూర్తి,దుర్గాప్రసాద్, కొల్లు శ్రీనివాస్, కొల్లు శ్రీనివాస్, నందిపాటి సుధాకర్, ఉమామహేశ్వరరావు, పొదిల్ల కృష్ణయ్య, రామినేని సతీష్ పాల్గొన్నారు.

## ఉపాధి పనిపై సోషల్ ఆడిట్



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పై బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రెసిడెంట్ అధికారి అడిషనల్ డీఎల్డీఓ సురేష్ ఏపిఓ చండీరాణి, ఏపీడి శ్యామల, ఎంవిడి ఆదిత్య వర్ధన్ హాజరై సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఏప్రిల్ ఒకటి 2023 నుండి 31 మార్చి 2024 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. 331పనులకు గాను కూలీల వేతనం 2,20,11,499 మెటీరియల్ 6,39,390 మొత్తం 2,26,50,899 ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఇట్టి పనులలో జరిగిన తప్పిదాలపై టెక్నికల్ అసిస్టెంట్లు రూ.11,415 పంచాయతీ కార్యదర్శులకు రూ.5451 ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.789 మొత్తం 17,655 పెనాల్టీలు విధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీవో సలీం, ఏపీఓ వెంకట కిషన్ రావు, సోషల్ ఆడిట్ టిఏలు, సిఓ, లు పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి

**ప్రజాపక్షం/తుంగతుర్తి:** మండలంలోని గొట్టిపర్తి గ్రామంలో ఈనెల 25న ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి జారిపడ్డ గీత కార్మికుడు బాలగాని మల్లికార్జున్ అలియాస్ మల్లయ్య(45) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసి ఆదుకోవాలని గీత పనివారుల సంఘం నాయకులు, తదితరులు డిమాండ్ చేశారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత




**ప్రజాపక్షం/రామన్నపేట:** మండలంలోని కొత్తగూడెం గ్రామంలో బొడ్రాయి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు జినుకల ప్రభాకర్, చిల్లర కైలాసం, నర్సిరెడ్డి, పున్నా జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/రామన్నపేట:** మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన తిరందాసు కమలమ్మ మృతిచెందగా విషయం తెలుసుకన్న మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి తండ్రి ఎడ్ల సుదర్శన్‌రెడ్డి ద్వారా రూ.5వేల ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబసభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు పున్నా వెంకటేశ్వర్లు, పిట్ట మహేందర్‌రెడ్డి, వరికుప్పల భాస్కర్, మేక నరేష్, తాటిపాముల లింగస్వామి పాల్గొన్నారు.



# ఎస్‌పి పేరుతో ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** సామాన్య ప్రజలనే కాదు ఏకంగా సూర్యాపేట జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డేను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. ఆయన పేరుతో ఫేక్ పేస్‌బుక్ అకౌంట్ తెరిచారు. అంతటితో ఆగకుండా పలువురికి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి డబ్బుల వసూళ్ల కోసం పన్నాగం పన్నారు. ఫోన్ పే, గూగుల్ పేతో తమకు డబ్బులు పంపాలని మెసేజ్‌లు పంపారు. కొంతమంది జిల్లాలో పని చేస్తున్న ఎస్ఐలు, సీఐలు, ప్రముఖులు వారి రిక్వెస్ట్‌కు ఓకే చెప్పారు. కొద్ది సేపటికే వారు చాటింగ్ చేస్తూ మీ అవసరం ఉంది. కొంత మొత్తం నగదు కావాలి. ఫోన్ పే, గూగుల్ పే చేస్తే తిరిగి రెండు రోజుల్లో పంపుతానంటూ రిక్వెస్ట్ పంపడం జరిగింది. దీంతో కొంత మంది పోలీసులు ఈ సమాచారాన్ని ఎస్‌పికి చేరవేశారు. దీంతో ఒక్కసారిగా అవాక్కైన ఆయన అప్రమత్తమై జిల్లా ఎస్‌పి ఫేస్‌బుక్ ఖాతా నుంచి వచ్చే మెసేజ్‌లకు ఎవరు స్పందించవద్దని ప్రకటన విడుదల చేశారు. తన పేరుపై ఉన్న ఫేక్ ఖాతాను ఎవరు డబ్బులు పంపవద్దని కోరారు.

# గుప్త నిధుల కోసం ఇంట్లో క్షుద్రపూజలు



**ప్రజాపక్షం/అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామంలోని ఓ ఇంట్లో గుప్తనిధుల కోసం క్షుద్ర పూజలు చేస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.గ్రామానికి చెందిన పద్మ అనే మహిళ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఇంట్లో పూజలు చేస్తే ఆరోగ్య సమస్యలు పోవడంతో పాటు గుప్త నిధులు లభిస్తాయని మాయమాటలతో నమ్మబలికారు. సదరు మహిళ ఒప్పుకోవడంతో రాత్రి పాడుబడిన ఇంట్లో పెద్ద గొయ్యి తవ్వి అందులో బొమ్మను ఉంచి పూజలు నిర్వహించారు. ఇంట్లో నుంచి పెద్ద శబ్దాలు వస్తుండటంతో స్థానికులు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దాడులు నిర్వహించిన పోలీసులు క్షుద్ర పూజలను అడ్డుకుని పద్మతో సహ ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పూజల్లో ఓ మైనర్ బాలిక కూడా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనతో చుట్టుపక్కల స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

# డివైడర్‌ను ఢీకొన్న బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్:** ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన బుధవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం వెంకట్రామాపురం గ్రామానికి చెందిన కుర్రి సైదులు(40) అనే అతను తన గ్రామంలో జరిగే గంగమ్మ జాతరకు భార్య,కుమార్తె సోమినితో కలసి వెళ్లి జాతర చూసుకుని తిరిగి చూసుకుని భార్య రమాదేవిని గరిడేపల్లిలో బస్సు ఎక్కించి తన ద్విచక్ర వాహనంపై కుమార్తె సోమిని, తమ్ముడి కుమార్తె శ్రీనిధి (10) ఎక్కించుకుని ముందు లగేజీ బ్యాగులు పెట్టుకుని హుజూర్‌నగర్‌కు వస్తుండగా మార్గమధ్యలో గోపాలపురం గ్రామం వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో సైదులు,శ్రీనిధి అక్కడికక్కడే మృతి చెందారని,తీవ్ర గాయాలైన సోమినిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారని మృతుని భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ద్వితీయ భాషగా అరబిక్ ఎంచుకునే అవకాశం

**ప్రజాపక్షం/కోదాడ:** ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా అరబిక్ ఎంచుకునే అవకాశం పట్టణంలోని రేస్,శ్రీవిద్య జూనియర్ కళాశాలల్లో బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కల్పించిందని జమాయతుల్ ఉల్మా పట్టణ అధ్యక్షులు అతహర్ మౌలానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అరబిక్ భాషను ఐచ్ఛికంగా ఎంచుకునే అవకాశం లేకపోవడంతో జమైతే హింద్ ఆధ్వర్యంలో ఆయా కళాశాలల యజమాన్యాలతో సంప్రదించి ఇంటర్మీడియట్ బోర్డుకు ప్రతిపాదనలు పంపించి అరబిక్ భాష ఐచ్ఛికంగా ఎంచుకునే అవకాశం కల్పించామన్నారు.అరబిక్‌భాష శాస్త్రం డిగ్రీ,పీజీ కోర్సుల్లో సైతం పలు విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉందని ఈ భాష ఐచ్ఛికంపై అభిరుచి ఉన్న విద్యార్థులు ఈ ఏడాది అడ్మిషన్ల ద్వారా పొందాలని కోరారు.పూర్తి వివరాలకు ముఫ్తీ అథహర్ ఖాస్మీ 9985223096,జియాసాహిబ్ 9700735893 లను సంప్రదించాలని కోరారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం /నిడమనూరు:** మండల పరిధి వెంగన్నగూడెం సమీపంలో గల పాత ఆముదాల ఆయిల్ మిల్ గోదాంలో పత్తి కాంటాకు ఉరి వేసుకుని మృతి చెందిన వ్యక్తి మృతదేహం బుధవారం ఉదయం లభించినట్లు గోపాలరావు తెలిపారు. మృతదేహంపై కాలిన బొగ్గలు ఉన్నట్లు తెలిపారు. మిల్లు వద్ద పనిచేసే గుర్ఖాకు రెండు మూడు రోజులకు ఒకసారి పశువుల దానాలు గోదాము నుండి తెచ్చి వేయడం జరుగుతుంది. బుధవారం ఉదయం దానా తెచ్చేందుకు వెళ్లిన గూర్ఖాకు దుర్గంధం రావడంతో గమనించిన గూర్ఖ పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగింది. మృతుని వయసు 30, 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చునని ఐదు అడుగుల ఎత్తు, నలుపు రంగు, కుడి చేతికి స్టీల్ ఉంగరం కలిగి ఉన్నట్లు తెలిపారు.మృతుని సమాచారం తెలిసినవారు నిడమనూరు ఎస్ఐ 9712670195,హోలియా సీఐ 8712670152 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఎస్ఐ గోపాలరావుగోపాలరావు తెలిపారు.

## పాఠశాల పనుల పరిశీలన



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను త్వరగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతలు పాటించాలని మండల స్పెషల్ ఆఫీసర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్ తెలిపారు. బుధవారంతుర్కపల్లి మండలంలోని గోపాల్‌పురం, నాగాయపల్లి గ్రామం, తండా, మాదాపూర్ గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేయాలని, నీటి వసతి, విద్యుదీకరణ వంటి పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీ బాయి, మండల పంచాయతీ అధికారి డి వెంకటేశ్వర్లు,మండల విద్యాధికారి కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హెడ్ కానిస్టేబుల్స్ మండవ హుస్సేన్‌గౌడ్, కెపి చారిలు అన్నారు.బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠవాలలో ఆటో డ్రైవర్లకు కమ్యూనిటీ పోలీసింగ్,సైబర్‌నేరాల పట్ల అవగాహన కల్పించి మాట్లాడారు. పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకుని ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరించారు.అతివేగంగా నడిపిన,డ్రైవింగ్‌లో మద్యం సేవించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఓటిపిలు,వ్యక్తిగత వివరాలు తెలపవద్దన్నారు.సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.